ఇట్లు,
మీ విధేయుండు

"వాణ్ణి చెడగొడుతున్నావు నాన్నా!" అన్నాడు మా అబ్బాయి మా మనవడు వేణుని హైదరాబాదు పంపించేననని.

నాకు తెలుసు.

వాడిలా అనడం మొదటిసారి కాదు. వేణు గురించి ఏ మంచి పని తలపెట్టి అమలుచేసినా వాడిలాగే అంటున్నాడు.

వేణుకి నేనేంచేసినా వాడు వృద్ధిలోకి రావడానికే చేస్తాను. కాని, వీడున్నాడే, మావాడు – వాడు కొడుకేదో నా మాటలు విని చెడిపోతున్నాడనట్టుగా మాట్లాడతాడు.

అదంతా నామీద కచ్చ! వేణుమీద అసూయాను. కాకపోతే మరేవిటి?

వేణుగాణ్ణి బి. ఎస్సీ ఆనర్సు చదవమని వాల్తేరు పంపేరు. వీణ్ణి పంపేనా?.... వేణుకి మంత్రిగారి మనవరాలి సంబంధం మాట్లాడాను. వీడికి మాట్లాడేనా! అందుకూ, వాడికా గుర్రు.

అసూయ వుందే; ఒక్కొక్కప్పుడు ఎవరి మీదికి జరుగుతుందో చెప్పలేం. కన్నకొడుకు మీదికే మళ్ళొచ్చు. కచ్చవుందే;

ఎవరిమీద కలగొచ్చో ఒక్కొక్కప్పుడు చెప్పలేం. కన్నతండ్రి మీదికే తిరగొచ్చు....చెప్పలేం కదా!

అలాగే, పాపం; మావాడు .... కొడుకు అభివృద్ధిలో కొచ్చేస్తున్నాడని – ఆ అభివృద్ధికి సాక్షాత్తూ వాడితాత! అంటే వీడి తండ్రే కారకుడని తెలిసికూడా – ఎప్పుడూ దేనికో ఊహూ గింజుకుపోతూ వుంటాడు.

అంతెందుకు?

వాణ్ణి — ఒరే బి. ఎస్సీ ఆనర్సుకి వెళ్ళరా అన్నాను. సరే, తాతయ్యా అన్నాడు. న్యూక్లియర్ ఫిజిక్స్ చదవరా అన్నాను. అనగానే వీడు–పానకంలో పుడకలా అడ్డొచ్చేసి న్యూక్లియర్ ఫిజిక్స్ ఎందుకు నాన్నా అది న్యూ అయితే కావచ్చు గాని క్లియర్ కాదు గదా—అన్నాడు.

వా డలా ఏదో సొడ్డు పెడతాడని నాకు తెలుసును.

కాని నేనేమీ జవాబు చెప్పఖర్లేక పోయింది.

మా వేణుగాడు తకీమని చెప్పేడు సమాధానం "మనం చదివి పారేద్దాం నాన్నా. అప్పుడది న్యూ కాదు; క్లియర్ కూడా అయిపోతుంది."

"శభాష్‌రా! నా పేరు నిలబెట్ట గలిగినవాడివి; నా మనవడివి నువ్వురా!" అని ఆనాడే అనుకున్నాను; నేను. "–నీలాగే అందరూ ఆ సబ్జక్టు చదవడానికి ఉత్సాహం చూపించి అణుశక్తిని అభివృద్ధి చేస్తే ఆ చైనావాడు మనమీదికి దండయాత్రకి రాకనే పోనుగదా" అని వాణ్ణి పబ్లిగ్గానే మెచ్చుకొని వాడికి హుషారిచ్చేను.

"కరెక్ట తాతయ్యా" — అంటాడు వాడు. నేను వాడి మంచి ఆలోచించి ఏం చెప్పినా సరే—

అంతేగాదు. వాడికి నా గురించి సదభిప్రాయం వుంది. "తాతయ్యా! నువ్వు ఆ రోజుల్లో పుట్టవలసినవాడివి కాదు తాతయ్యా ఈ రోజుక్కూడా నీమేధ నీ చురుకుతనం యిలా వున్నాయంటే అప్పుడింకెంతలా వుండేవాడివో కదా!" అన్నాడు వాడోసారి.

"వోర్-వోరి! పొగడ్డం ఆపరా, మీ నాన్న చల్లగావుండ! ఏమిటో కావాలి గాబోలు. తిన్నగా చెప్పేడువు!" అన్నాను.

"అదికాదు తాతయ్యా. అసలు నిన్ను తాతయ్యా అనడానికి నోర్రాదు, బాబాయ్ అనాలనిపిస్తోంది. వంట కాలవ వదకొండడుగులూ ఒక్కగెంతులో దాటేస్తావు. అరవై బాల్చీల నీళ్ళు సునాయాసంగా తోడుకొని అవలీలగా నెత్తిన పోసుకుంటావు. నాన్న ఆఫీసు వ్యవహారాల దగ్గర్నుంచీ అమ్మ అంట్లు తోమించడందాకా నీ సలహా లేందే క్షణం వెళ్ళదు. ఇప్పటి వాళ్ళల్లో ఇంత ఓపికేది, ఓర్పేది"

మంచిదే. ఒకరిమీది ఒకరికి సదభిప్రాయం వుండడం, అది అభివృద్ధికి కారణం అయినంతకాలం.

వాడు—

మొన్ననే ఆనర్స్ ఆన్సర్స్‌రాసి అనకాపల్లి వచ్చాడు కాదా.

"బనారస్ కాజా లాంటి కుర్రాడు లెండి ఐస్ క్రీమ్‌లాంటివాడు, తియ్యటివాడు! మెత్తటివాడు చల్లటివాడు." అది వాడిని గురించి మనవరాళ్ళు చెప్పిన మాటలు; అందులో నిర్మల ఒకతె.

అయితే మాత్రం వాణ్ణి ఆ శిఖండికి అంత సుళువుగా అందనిస్తానా! వెర్రిపిల్ల, వాడెవడనుకుంటున్నాది, దాని మనస్సులోకి వేణుగోపాలంగారి మనవడంటే నా పరువు, నా ప్రతిష్ఠ, నా ఆశ. నా తపస్సు కదా!

వాణ్ణి లాకాయి లూకాయి వాళ్ళచేతికి చిక్కనిస్తానా? అంతంత మాత్రం పిల్లలెవరూ వాడికి దగరు!

మొన్నటికి మొన్న—

వాడు తిన్నగా పరీక్షలు రాసి ఆరోగ్యంగా ఇంటికొస్తే చాలు తిరుపతి వొస్తానని, దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నానా?

వెళ్ళేనా లేదా!

వాణ్ణీ రమ్మన్నాను-వాడు-" రాలేను తాతయ్యా" అన్నాడు. "కొన్ని పుస్తకాలు చదవాలి తాతయ్యా! మామూలుగా పాసయినా క్లాసొచ్చినా అవి చదవాలి తాతయ్యా అవసరం" అన్నాడు "సరే వుండిపోరా" అన్నాను.

తిరుపతి, కాళహస్తి, కంచి, రామేశ్వరం అన్నీ తిరిగొచ్చేను.

అందరు దేవుళ్ళ కటాక్షం నా మీదున్నది.

నా మీదుంటే వాడి మీదున్నట్టే కదా.

అలా వున్నప్పటికీ వాణ్ణి చెడగొట్టటానికి ఏవో ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయంటే – ఏమిటనుకోవాలి.

ఏదీ, మొత్తం నేనింట్లో లేకుండాపోయింది. సరిగ్గా పద్దెనిమిది రోజులు సుమండీ_అంతే?

ఆ పద్దెనిమిది రోజులకీ వెర్రిబాగులాడు తోటకూర మొక్క నీళ్ళు పొయ్యకపోతే వాడి పోయినట్టు, నా సహవాసం, సలహా లేక – ఎలాగో అయిపోయాడు.

అల్లంత దూరాన్ని నేను కనబడగానే-"వొచ్చేవా తాతయ్యా —నువ్వింక రావే అనుకున్నాను! అక్కడెక్కడో సన్యాసుల్లో కలిసి పోతావనుకున్నాను." అంటూ మాటల్లో విచారం వ్యక్తపరుస్తున్నా మొహం మాత్రం వచ్చే సంవత్సరం కేలండర్లాగ పెట్టేశాడు.

నీ అభివృద్ధి పూర్తికాకుండా ఎలా వెళ్ళిపోతాన్రా! అనుకుని "ఏమిట్రా నాయనా" అన్నాను వాణ్ణి దగ్గిరికి తీసుకొని, కొంచెం అనునయ వాక్యాలు చెప్పేను.

కానీ, వాడికవి చాల్లేదు,

అవును మరి. అంత షాకు తిన్నాడు వాడు!

"పాహిమాం కృపయా తాతయ్యా! అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమా" అంటూనామీద పడిపోయేడు.

"ఏమిట్రా సంగతీ" అని తీరుబాటుగా విచారిస్తే - నమ్మరు. నేచెబితే!

కన్న తల్లిదండ్రులే అంత అన్యాయం చేస్తారా అని ముక్కు మీద వేలేసుకుంటారు. ఇందులో ఏదో మాయుంది అంటారు.

మాయాలేదు మర్మంలేదు. జరిగిందిదిటా—నేనలా తిరుపతికి బండెక్కగానే ఇలా ఎక్కణ్ణించో వో సమ్మంధం తీసుకొచ్చేట్ట వాళ్ళ నాన్న వాడికి;

"ఇంకేమున్నాది తాతయ్యా, లగ్గాలు పెట్టుగోడం ఆలిస్యం" అని భోరుమన్నాడు కుర్రాడు.

"పిల్లని చూళ్ళేదంటున్నావు కదురా. ఇంకా అవకాశం వుందిరా! పిల్ల నచ్చలేదు బొమ్మంటే సరి! తీరిపోతుంది!" అని వోదార్చేను.

"ఫోటో చూపించేరు తాతయ్యా! పిల్ల బాగానే వుంది."

"వోరి వెర్రికుట్టా! ఫొటోచూసి పిల్ల బాగున్నదని చేప్పేసేవా! ఇంక నిన్ను ఒడ్డెక్కించడఁవెఁలాగరా!?" అని కసిరీశాను వాణ్ణి.

"అదికాదు తాతయ్యా..."

"ఏదీకాదు;ఫో..." అని వాణ్ణి దులిపేసినా నేనూళ్ళో లేని సమయంచూసి నాకొడుకేగదా అని స్వతంత్రించి యింతపనిచేసిన మావాడిమీద నాకరికాలిమంట నెత్తికెక్కింది. వీడికిలావుందా అనుకొని ఈ సంబంధం ఎలాగేనా చెడగొడతానని శపథం పట్టేను.

పట్టకపోతే నేననుకున్న పని కాదుకదా మరి!

నేను రామేశ్వరం కంచీగించీ వెళ్ళొస్తున్నప్పుడు మెడ్రాసులో వోరోజు ఆగేను. అక్కడ రంగనాథం కనబడి హరి గురించిచెప్పేడు.

హరి గురించి వాడు చెప్పేదేమిటి? వాడు గొప్పవాడయ్యేడని; మంత్రైపోయేడని నాకు పేపరు చదివితే తెలియలేదా యేమిటి—?

మేం చదువుకొనేటప్పుడు; మా ముగ్గురం వొక జట్టు! ఒకసెట్టు; విడిపోతే వొట్టు—అన్నట్టు.

అదొక పురాణయుగం — ఆ రోజులూ ఆ వూసూ ఎందుగ్గాని, ఓనాడు ఉన్నట్టే ఉండి హరిగాడు- ఒరే అబ్బాయిలూమనం ముగ్గురంవొక్కటే కదా అన్నాడు.

అవున్రా మరి - అంతే కదా అన్నాం మేం.

"మీరు చూస్తూ వుండండి నేను మీ కన్నా ఎంతో ఎంతో గొప్పవాణ్ణి అయిపోతాను" అన్నాడు హరి.

చదువు సహంలో మానేసి వాడు రాజకీయాల్లో దిగిపోయేడు, జైల్లో కూచుని దేశమంటే మట్టి కాదోయ్ దేశ మంటె సొతంత్ర మోయ్ అని పుస్తకాలు రాశేశాడు.స్వతంత్రం ఒచ్చింది; ఏడిసిందిలే అని వాణ్ణికొట్టిపారేసేంమేం..ఆతరువాత ఓసారివాడెక్కడో కనబడితే కూడా నువ్వు గొప్పవాడివి కాకేమిట్రా కృష్ణుడు పుట్టిన పవిత్ర స్థలంలో ఏళ్ళ తరబడి గడిపేవు అని వేళాకోళంకూడా ఆడేసేను.

వాడు; ఆహరిగాడు ఇప్పుడు గౌరవనీయుడై పోయి,మంత్రై హైదరాబాదులో కూచున్నాడు.

రంగనాథం చెప్పిన రహస్యమేమిటి, మరి,

—అదే-హరి మనవరాలు ఒక జవరాలు మూటకట్టిన వరాలు పెళ్ళి కెదిగి సిద్ధంగా నున్నదిట, దానికి పెళ్ళిచేదామని తలపెట్టేట్ట హరి.

వాడు మంత్రి అవడం, ఒంటినిండా డబ్బు పూసుకున్న ఆ అమ్మాయి ఆటోమేటిగ్గా అందముగా కనపడ్డం అదీ యిదీ చూసి ఆ అమ్మాయిని నే చేసుకుంటానంటే నేనే ఎందుకు చేసుకోకూడదంటూ చుట్టాల పిల్లలూ బంధువుల అబ్బాయిలూ ఎగబడ్డారు.

అటూ యిటూ చూసి-నేను ఆదర్శవాదిని; నాకు, అందరూ సమానులే అంటూ పేపర్లో వరుడు కావలెను మార్కు ప్రకటన వోటి వేయించేడు. అది నాకు చూపించేడు రంగనాథం.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది—

ఆవేళ హరి "హరిగాడు" గా వుంటున్నప్పుడు ఒరే నేను గొప్ప వాణ్ణయిపోతానర్రా అంటే—నేను నీకన్నాగొప్పవాణ్ణి అయిపోతాను చూస్తూవుండ్రా అని నేనూ అన్నాను.

ఆవేళ సరదాకే అనుండచ్చు.

అది ఇవాళ నిజం చెయ్యొచ్చు కదా!

ఆపిల్ల, నాకొడుకు కోడలై తే; మా వేణుగాడు నా పేరు నిల బెట్టగలిగితే నేను వాడి కన్నా గొప్పవాణ్ణయినట్టే కదా.

అప్పుడు హరిమీద గిరి పడ్డట్టే కదా.

అందుకని—

"ఒరే;నువ్వు గుప్‌చప్‌గా ఈ ప్రకటనకి జవాబుగా నీ దరఖాస్తు పంపరా" అన్నాను.

"మరి ఆ పాలకొండసమ్మంధమో" అన్నాడు వాడు.

"పాలకుండా లేదు నీళ్ళకుండాలేదు --- అన్నట్టు వాళ్ళదీ మందీ గోత్రం వొకటి కాదురా; సంబంధం ఎలా కలుపుకుంటారు?" అని కోప్పడ్డాను.

ఒకటే అయ్యుంటుంది, గోత్రం

లేకపోతే ఆ సంబంధం అలా పుసిగిపోతుందా?

*　　　*　　　*

"డియర్ తాతయ్యా?

నీకు అనేక నమస్కారాలు—నువ్వెంత మంచివాడవో ఇక్కణ్ణుంచి చూస్తే కూడా కనబడుతున్నది. నీకు నా థాంక్స్ --

ఉత్తరం రాయమన్నాను, రాశాడు బాగానేవుంది. కాని ఈ సొదంతా ఎందుకు, నాకు తెలీదా! వాడికి నా మీద సద్భావం గౌరవం ఉన్నాయని!?

"సరే- ఇక్కడ దిగగానే ఒహడు అవుపించాడు. వాడు ఆరడుగుల ఎత్తున్నాడు. ఆ ఆరడుగులూ చాల్లేదన్నట్టు వాడి నెత్తిమీద మూరెడు తలపాగా చుట్టబెట్టేడు, దానిమీద మళ్ళా—కోడి పుంజుకి బుర్రమీదుంటుంది చూసేవూ, కుచ్చిళ్ళు పోసినట్టు కుచ్చు-అలాంటి దొక పింఛం కట్టేడు. వాడు మరి రైల్లోంచి దిగుతున్నవాళ్ళ నందర్నీ అడుగుతున్నాడో యేమో-నన్నూ అడిగేడు - వేణుగోపాలం గారు తమరేనా" అని,

నేను నువ్వు చెప్పినట్లుగా, దర్జాగా బిగుసుకుపోయి "నీ పేరేమి!?" అన్నాను. దానికి వాడు సహందాకా వంగిపోయి, నాపే రవ్వలసాంవిం బాబూ, తంవంరనకాపిల్లి నించే గదండి రాడం" అనే సేడు. ఓరి వెధవా! నువ్వూ మావేపు వాడివేనా. అయితే నీదగ్గర నా పప్పులెలా వుడుకుతాయిరా అనుకొని వెంటనే ప్లేటుమార్చేసేను.

"పెద్ద కారొకటితెచ్చేడు తాతయ్యా, వాడు, ఆ పెద్దకారులో, ఈ హైదరాబాదులో చాలా వాట్లోకి పెద్దదయిన ఈ బిల్డింగ్‌లోకి నన్ను లాక్కొచ్చాడు తాతయ్యా వాడు. నీసలహాలు అమూల్యం!" అన్నీ పాటిస్తున్నాను.

"మూడురోజు లయిందా! ఇంకా నాలుగు రోజులుండమంటు న్నారు వీళ్ళు! ముఖ్యంగా, మీ హరిగారు,

"రాగానే యింట్లో వాళ్ళందరికీ ఆయనే స్వయంగా పరి చయం చేసేరు. మంత్రి అంతటివాడు నన్ను అంత గౌరవంగా చూస్తున్నా నాకు మతిపోకుండా వున్నదంటే అది నీ సలహాలు జ్ఞాపకం వుంచుకోడంవల్లనే కదా.–నువ్వు అన్నావు కదా–ఎక్కడా తలవంచవద్దు. అడిగితేనేగాని కులం గోత్రం పితృ పితామహ నామాలు చెప్పొద్దు– అన్నావు. వాళ్ళు అడగాలేదు. నేను చెప్పా లేదు. ఇంత సంస్కారం అంతస్తూ వున్నవాళ్ళు అలాంటి సిల్లీ డిటేల్స్ అడుగుతారా! ఊరూ, ఆస్తులూ, చదువూ సంధ్యా జ్ఞానం దర్పం యివే చూసేరు, వాళ్ళు, మిస్టర్ వేణు. బి. ఎస్సీ ఆనర్స్ (న్యూ క్లియర్ ఫిజిక్స్) అనే గుర్తించేరు నన్ను వీళ్ళు, నాకు మాత్రం ఫలానా మాతాతయ్య మనవణ్ణిరా అని చెప్పేయాలని మహావుంది.

ఆ అమ్మాయి పేరు ప్రమీల–పేరుకుతగ్గ పిల్లలే---ఉండడా నికేమో మహా అందంగావుంది. పూర్తిగా వర్ణించిరాస్తే, తాతయ్యా

నువ్వు దెబ్బలాట కొస్తావు. నేను వాళ్ళ వల్లో పడిపోయేనని నామీద కస్సుమంటావు. వాళ్ళ ప్రలోభానికి లొంగిపోయేనని తిడతావు.

పేరుకుతగ్గ పిల్ల అన్నాను కదూ--- అంతచొరవా ధైర్యం యెక్కడా చూళ్ళేదు నేను; ఆఖరికి మా క్లాస్‌మేట్ ప్రసన్నకూడా ఎప్పుడో వోసారి మొగాణ్ణిచూసి బెదిరినట్టు తలవంచినట్టు, అధికుడే నని అంగీకరించినట్టు జ్ఞాపకం- కాని ఈ ప్రమీలా- - -? అమ్మ నాయినో! ---"

ఉత్తరం చదువుతూంటే నాకు ఆనందభాష్పాలొస్తున్నాయి. మా మనవడు వేణుగోపాలం మణిపూస! వాడు హరికేఅల్లుడు కావలసినవాడు. చిన్నవాడయిపోడంచేత వాడి మనవరాలికి మొగుడవుతున్నాడు. వాడు నా పరువు నిలబెడతాడు. నా ప్రతిజ్ఞకి ప్రాణం పోస్తాడు.

"నన్ను స్వయంగా కార్లోపెట్టుకు తిప్పుతోంది తాతయ్యా! అంటే డ్రైవరూ ప్యూన్ గీన్ ఎవ్వరూ వుండరన్నమాట, నన్ను ముందు సీట్లోకి రమ్మంటుంది. కబుర్లు చెప్పమంటుంది. మాట్లాడుతుంది. ఎదురుగావచ్చే బిల్డింగులూ, దృశ్యాలూ అన్నీ వర్ణించి చెబుతుంది. నాకు డ్రైవింగు రాదనిచెప్తే, విసుక్కోలేదు. నీకేం ఖర్మ డ్రైవింగు నేర్చుకోడాని కన్నాది. ఎన్ని కబుర్లు చెప్పింది. నే చెప్పినవెన్ని విన్నాది.-ఇవన్నీ నేను రాయలేను తాతయ్యా. రాయకపోతే నువ్వు దెబ్బలాటకొస్తావుగాని నా వల్ల కాదుబాబూ.

నన్ను వాళ్ళ క్లాస్‌మేట్స్, ఫ్రెండ్స్,టీచర్సు అందరికీ పరిచయం చేసింది. తను సంగీతం నేర్చుకున్న హిందుస్తానీ విద్వాంసురాలు- ఇంగ్లీషు డాన్స్ నేర్చుకున్నక్లబ్,కొన్నాళ్ళు సరదాగా అభ్యసించి మానేసిన స్కల్ప్చర్ సెంటర్,మరోమంత్రిగారి మేనకోడళ్ళు చీఫ్ సెక్రెటరీ మనవరాళ్ళు; తమ్ముడు కూతుళ్ళు కొత్తగా ఐ. ఏ.ఎస్

పాసై శ్టాఫ్ కాలేజీ కొచ్చిన బ్రైట్ యంగ్మెన్ అండ్ విమెన్-ఎంత మందో మూడురోజుల్లో డెభ్భై మందికి పైగా ఇంతింతలేసి గొప్ప వాళ్ళని పరిచయం చేసింది. నేను చాలా అల్పుణ్ణి అనుకుంటూవుండే వాణ్ణి తాతయ్యా. కాని అలాకానే కాదు.

నేను ఉండడానికిట ఆ పెద్దభవంతిలో వొక ఏర్కండిషండ్ గది యిచ్చేరు తాతయ్యా. అక్కడ నాకొక్కడికే ప్రత్యేకం. మీట నొక్కితే వెంటనే రావడానికూ్కడా ఎవడూ ఉండడు. నిమిషంన్నర పడుతుంది ఔట్హౌస్లోంచి ప్యూన్ రావడానికి. వాడు నా పిలుపు వినగలడుగాని. నేను గదిలో మాట్లాడేది విన్లేడన్నమాట. ఆ గదిలో రాత్రి పదీ, పదకొండూ పన్నెండూ- ఎన్ని గంటలవుతున్నా ఒక్కత్తీ నాతో కబుర్లు చెబుతూ వొంటరిగా కూర్చుండి పోతుంది ప్రమీల. బాగుందా? .... అబ్బే, ఏం లేదు తాతయ్యా! నీమాట దాటుతానా? నేనంత తొందరపడతానా?

అయింది. వీడి బాధ్యత ఇన్నాళ్ళకి వదిలింది.

* * *

ఆ అయిదురోజులూ మావాణ్ణి తిడుతూనేవున్నాను. మావేణు గాణ్ణి మెచ్చుకుంటూనే వున్నాను.

అయిదోరోజున "వచ్చేశాను తాతయ్యా" అంటూ వచ్చేశాడు నా జీవనదీపం, నా ప్రతిజ్ఞా పాటవం, మా వంశప్రతిష్టా పాలకుడు, మా మనవడు వేణుగోపాలుడు.

వెనకాతల అప్సరసలాంటి అమ్మాయి సిగ్గులొలకబోస్తూ లోపలి కొస్తోంది.

"అరి నీ దారుణం తగలెయ్యా! వెంటపెట్టుకు మరీ వొచ్చావా యేమిటి?" అనుకుని గుడ్లు తేలేశాను.

"కమిన్ సరస్వతి! ఈయన మా తాతగారు నన్నింతవాణ్ణి చేసిందీయనే!" అన్నాడు వేణు నన్ను చూపెడుతూ.

"నమస్కారఁవఁండీ" అని ఆపిల్ల వినయంగా నవ్వింది. మా వాడికి తగిన ఈడూ జోడూ, వొడ్డూ పొడుగూనూ.

కాని సరస్వతంటున్నాడేఁవిఁటి - అని మొహం వేళ్లేశాను. ఒహవేళ పేరూ గట్రా మార్చుకోలేదుగద!

అయినా వీడితో యిలా పంపేడేమిటి. హరి! అని యిబ్బంది గానే వుంది. ఏమో ఇదీ వొక రకం గొప్ప సంప్రదాయమేమో!

"ఏమిట్రా వేణూ యిది నేనెవరో ఆ పిల్లకి చెప్పేవు; బాగానే వుంది; కాని ఆ పిల్లెవరో, కథా కమామీసూ నాకు చెప్పఖర్లేదుట్రా?" అన్నాను లేని నవ్వు తెచ్చుకుంటూ.

"చెప్తాగా!" మా వేణుగాడు; అప్పుడప్పుడు నేను నవ్వుతూ వుంటానే అంత గడుసుగా నవ్వేడు. అటు తిరిగి "పద సరస్వతీ! లోపలికెళ్ళు. అమ్మ ఉంటుంది. నమస్కారం చేసి నిన్ను నువ్వు పరిచయం చేసుకో. నే నిప్పుడే తాతయ్యతో మాట్లాడి వచ్చేస్తాను. అమ్మ దగ్గిర దేనికీ మొహమాటపడకు. మీ - కాఫీ అదీ తయారు చేయించు. అత్తా కోడలూ వొకటైపోండి" అన్నాడు.

ఎన్ని నేర్చేడు, వేణుగాడు! పైగా ఆ అమ్మాయి పెంపుడు పావురంలా వాడి మాటలకి మెత్తగా అందంగా ముడుచుకుంటూ. లోపలి కెళ్ళింది.

"ఊఁ," అన్నాను. కథ చెప్పు! అన్నట్లు.

"ఈ సరస్వతీ వాళ్ళది - పాలకొండ తాతయ్యా, అప్పుడు ఫోటో చూసేనని చెప్పేనే- ఆ పిల్లే అన్నమాట. హైద్రాబాదులో

వీళ్ళన్నయ్య ఉద్యోగం చేస్తున్నాట్ట, ఇంటికి దిగబెట్టమన్నాడు. కొన్నాళ్ళు మనింట్లో అలవాటయ్యేక వెళుతుంది."

"షటప్ రాస్కెల్;" అందామని వుంది. కాని అల్లారుముద్దుగా పెంచానే! అంతమాట అననా?

"ఇదేంట్రా నాయనా ఇది;" అన్నాను.

"అంతే తాతయ్యా. ఇంకేమీ అనకు. నువ్వు కోప్పడతావే మోనని హడిలిపోయాననుకో. మా తాతయ్య బంగారు!" అంటూ నామీదకొచ్చేడు వేణు.ఈ ఒక్క విషయంలోమాత్రం "నువ్వు చెప్పి నట్టు చెయ్యలేకపోయాను తాతయ్యా" అని గుస గుసలాడేడు.

"మరి ప్రమీల - ఆ అమ్మాయి మంచిదే అన్నావు కదురా, నువ్వు! .... ఆ ఉత్తరం- అదంతా?" అని రాళ్ళు తన్నుకున్నట్టు తడబడ్డాను.

"అదంతా నిజమే తాతయ్యా. ఆ అమ్మాయి నాకెన్నో నేర్పింది.... కాని నాక్కావలసింది- పెళ్ళాంవాం, మొగుడా?"